నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 నిజామాబాద్, మంగళవారం 31 డిసెంబర్ 2024 KAMAREDDY



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్, ఆయేషా ఫాతిమా, ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఏ అలీం, మాజీ ప్రజాప్రతినిధులు

# పోచారంను చరిత్ర క్షమించదు

- పార్టీ కష్టాల్లో ఉంటే బాధ్యత తీసుకోవాలి
- కానీ బరువు తగ్గించుకుని తప్పించుకున్నారు
- అలాంటి వారికి బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు
- బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో సమావేశం


బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఖలీల్‌వాడి, డిసెంబర్ 30: 'బాన్సువాడకు వేల కోట్ల నిధులు ఇచ్చిండు కేసీఆర్. ఆయన ఇచ్చిన నిధులు ముందు పెట్టుకుని ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి పోచారం శ్రీనివాసరెడ్డి. ఆయనకు మంత్రిగా, స్పీకర్‌గా పదవులు ఇచ్చింది కేసీఆర్. కానీ పార్టీ కష్టాల్లో ఉంటే బాధ్యత తీసుకోకుండా బరువు తగ్గించుకుని పక్కకు తప్పించుకున్నారని' ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. మంచి మనస్సుతో మనం క్షమించినా పోచారంను తెలంగాణ చరిత్ర క్షమించదన్నారు. అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం బాన్సువాడ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాన్సువాడను బంగారు వాడలా మార్చిందే కేసీఆర్ అని అన్నారు. స్వతంత్ర దేశంలో ఎన్నడూ లేని విధంగా బాన్సువాడకు నిధుల వరద పారించింది కేసీఆర్. రూ.12 వేల కోట్ల నిధులు, 9 వేల ఇండ్లు ఇచ్చిండు. బాన్సువాడ ప్రజలు బాధ పడొద్దని ఊరూరా బీటీ రోడ్లు వేయించిండు. దవాఖానాలు, విద్యా సంస్థలు ఏర్పాటు చేసిండు. అన్నింట్లోనూ బాన్సువాడను అభివృద్ధి చేసిండని గుర్తు చేశారు.

### మర్యాద కాపాడుకోలే..

కేసీఆర్ ఇచ్చిన నిధులను ముందు పెట్టుకుని ఎన్నికలు గెలిచిన వ్యక్తి పోచారం శ్రీనివాసరెడ్డి. ఆయనకు మంత్రిగా, స్పీకర్‌గా పదవులు ఇచ్చింది కేసీఆర్. కానీ ఇచ్చిన మర్యాదను ఆయన కాపాడుకుంటే బాగుండేది. రెక్కలు వచ్చిన తర్వాత తల్లిని వదిలేసిన బిడ్డలాగా.. గెలిచిన తర్వాత, పార్టీ కష్టాల్లో ఉంటే వెంటనే పార్టీ మారిండు. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమంటే ఇదేనని కవిత అన్నారు. పార్టీ అంటే తల్లి లాంటిది. లక్షలాది మంది కార్యకర్తలకు గుండె ధైర్యం లాంటిది. వాళ్లను కాపాడుకున్నాం కాబట్టే 25 ఏండ్లుగా బీఆర్ఎస్ ముందుకు సాగుతున్నదన్నారు. 25 సంవత్సరాల క్రితం ఒక వ్యక్తిగా మొదలై రాష్ట్రాన్ని సాధించడం అంటే మామూలు విషయం కాదని తెలిపారు. ఒక్క రక్తం చుక్క కింద పడకుండా రాజకీయ ప్రక్రియ ద్వారానే తెలంగాణ సాధించుకోవాలని కేసీఆర్ ఆనాడే చెప్పిండు. అన్నట్లే తెలంగాణను సాధించిండన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణను దేశంలో నంబర్‌వన్ చేయాలన్న ఆలోచన ఉండేదని, రాష్ట్ర అభివృద్ధి కోసం అలాగే పని చేశామని కవిత చెప్పారు.

### మన శక్తి చూపిద్దాం..

ప్రజల వద్దకు వెళ్లాలి, కార్యకర్తల వద్దకు వెళ్లి ధైర్యం చెప్పాలని పార్టీ నాయకులకు కవిత సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన శక్తి ఏంటో చూపించాలన్నారు. బాన్సువాడకు మంచి ఇన్‌చార్జిని ఇచ్చేందుకు కృషి చేస్తామని, మీ విన్నపాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని కవిత తెలిపారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఓట్లతోనే తాను ఎమ్మెల్సీగా గెలిచానని గుర్తు చేసిన ఆమె.. తాను బాన్సువాడకు కూడా ఎమ్మెల్సీనని చెప్పారు. మీరు మంచి కార్యక్రమం మొదలు పెట్టండి. తప్పకుండా బాన్సువాడకు వస్తానని పార్టీనాయకులకు సూచించారు. మీరంతా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు అయ్యే వరకూ కలిసి పోరాడదామని తెలిపారు. బాన్సువాడ ఇన్‌చార్జ్ జుబేర్, జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, సుమిత్రానంద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

### రాబోయే రోజులు మనవే..

స్థానిక సంస్థల్లో ప్రజలు మన వైపే చూస్తున్నారని, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపాలని కవిత బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. గులాబీ కండువా కప్పుకున్న కార్యకర్తలంతా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ వాళ్లను నిలదీయండి. ప్రశ్నించండని పిలుపునిచ్చారు. రాబోయే రోజులు మనవే. పార్టీకి పునర్వైభవం వస్తుందన్నారు. పార్టీని వీడి వెళ్లిన నాయకులు ఇప్పుడు తీవ్రంగా మథన పడుతున్నారని, కాంగ్రెస్‌లోకి ఎందుకు పోయామని బాధ పడుతున్నారని తెలిపారు. దూరపు కొండలు నునుపు అన్నట్లు ఆలోచనలో పడ్డారని చెప్పారు.

### యథేచ్ఛగా ఇసుక దందా..

టీఎస్ఎండీసీ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్‌కు నియంత్రణ చేసే అధికారం ఉన్నప్పటికీ పెద్ద వాగు, కప్పలవాగులో ఇసుక దోపిడీ జరుగుతుందన్నారు. పోలీస్ స్టేషన్ల ముందు నుంచే ఇసుక రవాణా జరుగుతున్నదని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో ఇసుక, గుట్కా దందాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది. పేట్రేగిపోతున్న గుట్కాను పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. మేడిగడ్డ నుంచి వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీకి నీళ్లు నింపి నిజామాబాద్ సుభిక్షంగా ఉండేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తే ఎక్కడ మనకు పేరు వస్తుందోనన్న పిచ్చి ప్రయత్నంతో రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు.



# నిద్రా కాదు.. నిధులు తెండి

- కాంగ్రెస్ పాలనలో అనాథలా ఉమ్మడి జిల్లా
- ఏడాదిగా మంత్రి లేడు.. ఇన్‌చార్జి మంత్రి పట్టించుకోడు
- లక్షలాది మందికి రుణమాఫీ సంపూర్ణంగా అమలు కాలేదు
- కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం
- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ రక్షణ గోడలా మారిందని ఎద్దేవా

నిజామాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) పీసీసీ చీఫ్ హోదాలో మహేశ్‌కుమార్‌గౌడ్ తొలిసారి నిజామాబాద్‌కు గౌడ్ వచ్చినప్పుడు భరోసా ఇస్తాడనుకుంటే, నిధులపై ప్రకటన చేస్తాడనుకుంటే హైడ్రా మాదిరిగా నిద్రా పెడతామమంటూ సామాన్య జనాలను భయపెట్టాడని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఈ ప్రకటనతో చిన్నపాటి రియల్ ఎస్టేట్ వ్యాపారులంతా కుదేలయ్యారన్నారు. నిద్రా తెచ్చి బుల్డోజర్లతో ఇండ్లు కూల్చేస్తామని చెప్పడంతో అందరూ భయపడుతున్నారన్నారు. కాంగ్రెస్‌లో అత్యున్నతమైన పదవిలో ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్ జిల్లాను అభివృద్ధి చేయాలలి తప్పితే ప్రజల ఇంటి మీదికి బుల్డోజర్లు తీసుకెళ్లద్దని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ దండునీతూ కిరణ్‌తో కలిసి సోమవారం నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కవిత విలేకరులతో మాట్లాడారు.



### షుగర్ ఫ్యాక్టరీ ఎప్పుడు తెరిపిస్తారు..?

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 3.79 లక్షల మందికి కేసీఆర్ హయాంలో రుణమాఫీ జరిగిందని, కాంగ్రెస్ పార్టీ కేవలం 2 లక్షల మందికే చేసిందని కవిత తెలిపారు. నిజామాబాద్‌లో ఇంకా 1.02 లక్షల మందికి, కామారెడ్డి జిల్లాలో 75వేల మందికి రుణమాఫీ జరుగలేదని గణాంకాలతో వివరించారు. తెలంగాణ యూనివర్సిటీకి వీసీని నియమించినప్పటికీ నిధుల్లేవని, బడ్జెట్ కేటాయింపులు సున్నాగా మారిందన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని సెప్టెంబర్ 17లోగా తెరిపిస్తామని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో సీఎం మాటిచ్చినప్పటికీ ఇంత వరకూ నెరవేర్చలేదన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా, నిజామాబాద్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు సిర్ప రాజు, ముఖ్య నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, ప్రభాకర్‌రెడ్డి, సత్యప్రకాశ్, మాస్తా ప్రభాకర్, సుమిత్రానంద్, చింతా మహేశ్, శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ శంకర్ పాల్గొన్నారు.

### అనాథలా మారిన ఉమ్మడి జిల్లా..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిస్థితి అనాథలా మారిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిగా మంత్రి లేడని, ఇన్‌చార్జి మంత్రి ఎప్పుడు వస్తాడో తెలియదని, ఎంపీ ఉన్నా లేనట్లేనని మండిపడ్డారు. ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు కొబ్బరి కాయలు కొట్టరు. వారిని ఏమీ చేయనీయరు. కాంగ్రెస్‌లో ఓడిపోయిన నేతలే అన్నీ చేస్తారన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్, షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి వంటి పెద్ద నాయకులు ఉన్నప్పటికీ కొంతకాలంగా నిజామాబాద్‌కు సీపీ లేకపోతే పట్టించుకోవడం లేదని విమర్శించారు.

### బీఆర్ఎస్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీఆర్ఎస్‌ను టార్గెట్ చేశాయి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. లేనిపోని ఆరోపణలతో జైలుకు పంపాలని యత్నిస్తుండడాన్ని సభ్య సమాజం ఖండిస్తున్నది. కవితపై కేంద్రం నిరంకుశంగా వ్యవహరించింది. ఇప్పుడు కేటీఆర్‌పైనా అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కుట్రలు చేస్తున్నాయి. కేసీఆర్ హయాంలో రాష్ట్రమంతా సుభిక్షంగా ఉంటే ఇప్పుడు అధోగతి పాలవుతున్నది. గురుకులాల్లో పిల్లలకు సరిగా తిండి పెట్టే చాతనైతలేదు. కేసీఆర్ హయాంలో గురుకులాల్లో సమస్యల్లేకుండా పరిపాలన అందించాం. ఇప్పుడెందుకు సమస్యలు వస్తున్నాయి. రేవంత్‌రెడ్డి చీటర్. దొంగ హామీలిచ్చి గద్దెనెక్కి ప్రజలను ఏడిపిస్తుండు.

**- బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే**

### పోరాటాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదు...



ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌కు పోరాటాలు కొత్త కాదు. 14 ఏండ్ల పాటు అలుపెరగని ఉద్యమాలు చేసి తెలంగాణ సాధించుకున్న చరిత్ర కేసీఆర్‌కు ఉంది. అలాంటి పార్టీకి, అలాంటి నాయకత్వాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగా ఇబ్బంది పెట్టినా వెనుకడుగు వేసే ప్రసక్తి లేదు. అన్యాయంగా కవితను అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టారు. ఇప్పుడు కేటీఆర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పెట్టాలని యత్నిస్తున్నాయి. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక లేనిపోని కేసులతో జనాల మూడ్‌ను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నది.

**- దాదాన్నగారి విఠల్‌రావు, జడ్పీ మాజీ చైర్మన్**

# కామారెడ్డిలో పెరిగిన నేరాలు



- మహిళల సంబంధిత నేరాల్లోనూ పెరుగుదల
- గతేడాది కన్నా ఎక్కువగా కేసుల నమోదు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధూశర్మ
- వార్షిక నేర నివేదిక విడుదల

కామారెడ్డి,డిసెంబర్ 30: కామారెడ్డి జిల్లాలో గతేడాది కన్నా ఈసారి నేరాల సంఖ్య పెరిగింది. మహిళా సంబంధిత నేరాల్లోనూ పెరుగుదల నమోదైంది. కామారెడ్డి జిల్లాలో ఏడాది వ్యవధిలో నమోదైన కేసుల వివరాలను ఎస్పీ సింధూశర్మ వెల్లడించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డితో కలిసి వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. 2023లో జిల్లావ్యాప్తంగా మొత్తం 5,578 కేసులు నమోదు కాగా, ఈసారి 6,006 కేసులు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు. ఇందులో 708 ఆస్తి సంబంధిత నేరాలు, 38 హత్యలు, 35 కిడ్నాప్‌లు, 60 అత్యాచారాలు, 513 రోడ్డు ప్రమాద కేసులు, 1,441 ఇతర కేసులు, 561 స్పెషల్ లోకల్ చట్టాలు కేసులుగా, 535 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయని వివరించారు.

- 2023లో 28 హత్య కేసులు నమోదు కాగా, ఈసారి ఆ సంఖ్య 37కు పెరిగింది. 35 హత్య కేసుల్లో నిందితులను అరెస్టు చేశామని, త్వరలోనే వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని సింధూశర్మ తెలిపారు. ఆస్తి సంబంధిత నేరాల్లో 65 శాతం కేసులను ఛేదించామని, 53 శాతం సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అందించామన్నారు.
- ఇక, మహిళా సంబంధిత నేరాల్లోనూ పెరుగదల నమోదైంది. నిరుడు 361 కేసులు నమోదు కాగా, ఈసారి 517 కేసులు నమోదు కావడం గమనార్హం. 12 హత్యలు, 60 అత్యాచార ఘటనలు చోటు చేసుకున్నాయి. 304 గృహ హింస, 103 లైంగిక వేధింపులు, 25 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు. షీ టీమ్‌లు చురుగ్గా పని చేస్తున్నాయని, ఈ సంవత్సరంలో 712 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు సింధూశర్మ చెప్పారు. 2,094 హాట్ స్పాట్‌లను పరిశీలించామని, 72 కేసులు నమోదు చేశామన్నారు. 56 లక్షల విలువైన ఫేక్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎవరికైనా సమస్య ఉంటే జిల్లా పోలీసు కార్యాలయంలోని కంప్లెయింట్ సెల్ (87126 86142)కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. 2025లో నేరాలు తగ్గేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### అన్ని కోణాల్లో విచారణ..

భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట కానిస్టేబుల్ శ్రుతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ ఆత్మహత్య కేసులో అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని ఎస్పీ సింధూశర్మ వెల్లడించారు. ముగ్గురి మృతి కేసుపై విలేకరులు ప్రశ్నించగా ఆమె స్పందించారు. అవి హత్యలా.. ఆత్మహత్యలా? ప్రమాదకరంగా జరిగిందా? కాపాడే క్రమంలో జరిగిందా? అన్న కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. ముగ్గురి మొబైల్ ఫోన్లు, నీటి నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని, నివేదిక వచ్చాక వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

### కామారెడ్డి అడిషనల్ ఎస్పీగా చైతన్యారెడ్డి



కామారెడ్డి, డిసెంబర్ 30: కామారెడ్డి అడిషనల్ ఎస్పీగా బొక్క చైతన్యారెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ విభాగంలో ఏఎస్పీగా ఉన్న 2022 బ్యాచ్ ఐపీఎస్ ఆఫీసర్ అయిన ఆమెను కామారెడ్డికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇన్‌చార్జి అడిషనల్ ఎస్పీగా ఉన్న నర్సింహారెడ్డి నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.


ఇంటి నుంచి తెచ్చుకున్న బాక్సుల్లో భోజనం తింటున్న విద్యార్థులు

కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ గాడి తప్పింది. పాఠశాలల్లో అంతు లేని నిర్లక్ష్యం కనిపిస్తున్నది. మండలంలోని జప్తి జాన్కంపల్లిలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా కరువైంది. విద్యాసంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఇంటి భోజనమే దిక్కయింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొద్దున పూట వంట కాక, కారం మెతుకులు తిని వస్తున్న పిల్లలకు మధ్యాహ్నం లంచ్ బాక్సులో కూడా అదే తొక్కు అన్నం పెడుతుండడంతో తినలేక పోతున్నారు.

–నాగిరెడ్డిపేట, డిసెంబర్ 30


# ఇంటి భోజనమే దిక్కు


వృథాగా మారిన వంటశాల షెడ్డు

- విద్యార్థులకు అందని మధ్యాహ్న భోజనం
- ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకుంటున్న వైనం
- పాఠశాల మొదలైనప్పటి నుంచి ఇదే తంతు
- పట్టించుకోని అధికారులు

కేసీఆర్ పాలనలో ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టే వారు. సన్నబియ్యంతో ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించే వారు. కానీ, కాంగ్రెస్ రాకతో విద్యావ్యవస్థ గాడి తప్పింది. విద్యార్థులను పట్టించుకునే వారే కరువయ్యారు. దాదాపు ఆర్నెళ్లుగా పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టలేక సమస్యను తీర్చే వారు లేకుండా పోయారు. జప్తిజాన్కంపల్లి ప్రాథమకొన్నత పాఠశాలలో 63 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న వీరికి విద్యాసంవత్సరం ఆరంభం నుంచి మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు. దీంతో పిల్లలు ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్నారు. ఉదయం వేళ వంట కాకపోవడంతో పచ్చడి మెతుకులు తిని వస్తున్నారు. అవే కారం మెతుకులను బాక్సుల్లో తెచ్చుకుంటున్నారు. రెండుపూటలా పచ్చడితో తినలేక సతమతమవుతున్నారు. మరికొందరేమో మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వెళ్తుండగా, ఇంకొందరు సాయంత్రం వరకూ ఖాళీ కడుపులతోనే ఉంటున్నారు. మరోవైపు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహణకు ఎవరూ ముందుకు రావడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించరించేందుకు గ్రామస్తులతో కలిసి పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేశామని, కానీ వంట చేసేందుకు ఎవరూ రావడం లేదంటున్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, వారు స్పందించి మధ్యాహ్న భోజనం పెట్టించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ఖాళీ కడుపుతో ఉంటున్నారు..



మధ్యాహ్న భోజనం పెడుతలేరు. ఇంటి నుంచి బాక్సు తెచ్చుకుంటున్నాం. పొద్దున వంట కాక పచ్చడితో తిని టిఫిన్ తెచ్చుకుంటున్నాం. కొందరు మధ్యాహ్నం ఇంటికెళ్తే, కొందరు ఖాళీ కడుపుతోనే ఉంటున్నారు.

**- గోవర్ధన్, ఆరో తరగతి**

### త్వరలో ఏర్పాటు చేస్తాం



ఏజెన్సీ నిర్వాహకులు ముందుకు రాకపోవడంతో భోజనం పెట్టడం లేదు. గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసినా లాభం లేదు. ఆగస్టులో ఒకరొచ్చినా వారం తర్వాత మానేశారు. త్వరలోనే మధ్యాహ్న భోజనం పెట్టించేందుకు ఏర్పాటు చేస్తాం.

**- అనసూజ, హెడ్మాస్టర్**